క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ప్రచారం

ఉండి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఆదివారం ఉండి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. ముందుగా ఆయా గ్రామాల్లో నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ జయంతికి పీవీఎల్‌కు ఆహ్వానం



పీవీఎల్‌కు ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

ఉండి: మండలంలోని చెరుకువాడలో ఆదివారం నిర్వహించే అంబేడ్కర్ జయంతి వేడుకలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మీ హాజరుకావాలని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొరపాటి అనిత, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, స్థానిక యూత్ సభ్యులు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఆకుల బిల్‌మోరియా, కొరపాటి ఏసుబాబు, కుచ్చులపల్లి జీవన్‌బాబు, కంకిపాటి మోహన్, అనిపే సతీష్, మోహన్, గుసుపూడి అజయ్, కంకిపాటి యేసుపాదం, కొయ్యే సురేష్, సుదర్శన్, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని డీ1 విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్ ఏరియా, బొక్కావారిపాలెం, మల్లె తోట, చిన్న రంగనిపాలెం, హౌసింగ్ బోర్డ్ ఏరియా , పీపీ రోడ్డు, ఇండస్ట్రియల్ ఏరియా, నరసయ్య అగ్రహారం, పార్క్ స్ట్రీట్ ఏరియా, వేండ్ర కెనాల్ రోడ్, రామచంద్రపురం, కోడవల్లి రోడ్డు, సబ్ రిజిస్టర్ ఆఫీస్, మారుతీ నగర్, ప్రకృతి ఆశ్రమం, సంజన అపార్ట్‌మెంట్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని అహ్మద్‌ఖాన్ కోరారు.

ఘనంగా పేరంటాలమ్మ ఉత్సవాలు



పేరంటాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఉండి: వెలివర్రులో వీరపేరంటాలమ్మ 71వ వార్షిక మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదవ రోజు శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహిళలు లలితా పారాయణం చేశారు. అభినవ నాట్య అకాడమీ వారిచే కూచిపూడి భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు.

మాకినేని బాటలో యువత పయనించాలి

భీమవరం: మాకినేని బసవ పున్నయ్య ఆశయాలకు అనుగుణంగా నేటితరం కార్యకర్తలంతా పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ పిలుపునిచ్చారు. భీమవరం పట్టణంలోని సుందరయ్య భవనం వద్ద శనివారం బసవపున్నయ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ముందుగా బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర పోరాటంలోనూ అనంతరం భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించడంలో మాకినేనిపాత్ర ఎనలేనిదని కొనియాడారు. దళితులను అంటరాని వారుగా చూడడాన్ని ఆయన తీవ్రంగా వెతిరేకించారని ఆయన చూపిన బాటలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జెఎన్‌వీ గోపాలన్, బి వాసుదేవరావు, ఎం వైకుంఠరావు, ధనికొండ శ్రీనివాస్, ఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వర స్వామిని శనివారం ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

సంక్షేమ సారథికి ఘన స్వాగతం పలకాలి





పెద అమిరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్, పక్కన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి
- పెద అమిరంలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం

కాళ్ల: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలకాలని, నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులు అంతా భారీగా తరలిరావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన భీమవరం పరిధిలో జరగనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి అందించి ఓట్లు అడిగే అర్హత సంపాదించుకున్నారన్నారు. నామినేషన్లు వేసే సమయం దగ్గర పడుతున్నా ప్రతిపక్షాలు ఇంకా సీటు ఎవరికి కేటాయించారో తెలియక కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో తాను ఓటమి పాలైనప్పటికీ సీఎం వైఎస్ జన్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోగలిగామని గుర్తు చేశారు. ఇప్పటివరకు నియోజవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధు లు తనకు అండగా ఉన్నారని, అదే స్ఫూర్తితో పనిచేసి ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

ఈ సమావేశంలో పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. సిద్ధం సభను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. ఉండి నియోజకవర్గంలో ట్రిపుల్ ఆర్ అజ్ఞానంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. తనను అభ్యర్థిగా ప్రకటించడంతో పీవీఎల్‌ను మార్చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ పీవీఎల్ ఒక్క పిలుపుతో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావడం చేస్తుంటే ఉండిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భీమవరం పరిశీలకులు మోటుపల్లి గంగాధర్, ఆకివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, కాళ్ళ, ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పెన్మెత్స విశ్వనాథరాజు, భూపతిరాజు చంటిరాజు, శ్రీహరి రాజు, విజయలక్ష్మి, పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థల మహంకాళి, ఆకివీడు, ఉండి ఏఎంసీ చైర్మన్లు షేక్ రసూల్ బేబీ, బొక్కా వెంకటేశ్వర్లు, ఆయా మండలాల సొసైటీలో చైర్మన్లు, మండల పార్టీ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే అంబేడ్కర్ ఆశయసాధన



మాట్లాడుతున్న పీవీఎల్, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

కాళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధన కోసం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహారాజు, నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తెలిపారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లనే అన్ని రంగాల్లోనూ వెనుకబడిన వారు ముందంజలో ఉంటున్నారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని హేళన చేసి మాట్లాడారని గుర్తు చేశారు. కానీ దళిత నేతలను హోం మంత్రులుగా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. అంతేగాకుండా విజయవాడలో అంబేడ్కర్ అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటుచేసి రాష్ట్రాన్ని ప్రపంచస్థాయిలో అత్యున్నత స్థానంలో నిలిపారని కొనియాడారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఆదివారం ప్రతి గ్రామంలోనూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు.

జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

ఉండి: తమకు మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు సోదరుడు గోపాలకృష్ణంరాజు అన్నారు. శనివారం మండలంలోని పాందువ్వ గ్రామంలో పీవీఎల్ తరుపున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అఖండ విజయాన్ని చేకూర్చాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజలిచ్చిన అధికారాన్ని ప్రజాసంక్షేమం కోసం వినియోగించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి కుటుంబానికి ఏటా రూ.లక్షల్లో సంక్షేమ పథకాలు అందించారని, కరోనా వంటి కఠిన సమయంలోను ప్రజలకు అండగా ఉన్నారని గుర్తుచేసారు. అంతే కాకుండా సొంతింటి కల, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారని అన్నారు. మరోసారి జగన్‌ను దీవిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధిని మనం చూడగలమని గోపాలకృష్ణంరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు అల్లూరి వెంకటరామరాజు (రాంబాబు రాజు), గొంతే హరీష్, జీ సుందర్‌కుమార్, వెలగపల్లి టోనీ, పెన్మెత్స సుబ్బరాజు, నేతల ప్రదీప్, అంబటి నాగేంద్ర, దెందుకూరి శ్రీనివాసరాజు, దెందుకూరి నర్సింహరాజు, కలిదిండి రామసీతమ్మ, దవిలి అప్పన్న, గొల్లపిల్లి రాంబాబు, కూన సత్యనారాయణ, పాలపర్తి శ్రీను, పెల్లూరి అప్పన్న, వార్డు సభ్యుడు గాతల వెంకన్న తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉండి: పాందువ్వలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ సోదరుడు గోపాలకృష్ణంరాజు

అన్ని వర్గాల ప్రజలు జగన్ వెంటే...

కాళ్ల: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే అందరూ ఉంటారని కాళ్ల సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సుంకర భోగేశ్వరరావు తెలిపారు. శనివారం కాళ్లలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పల్లపువీధిలో సుంకర భోగేశ్వర ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనలో జరిగిన సంక్షేమ అభివృద్ధిని వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఉండి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును, ఎంపీగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాపులు సత్యవతి, గన్నిశెట్టి బెనర్జీ, నిమ్మల వెంకటరత్నం, వడ్డీ కాసులు, వంటా బత్తుల శేఖర్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాళ్ల: పీవీఎల్‌ను గెలిపించాలంటూ వైఎస్సార్ సీపీ శ్రేణుల ప్రచారం



ఆకివీడు: స్థానిక మాదివాడలోని ముస్లిం వీధిలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ నిమ్మల నాగు

జగన్ ప్రభుత్వం మేలు చేస్తేనే ఓటు వేయండి

ఆకివీడు: జగన్ ప్రభుత్వం గత 58 నెలల్లో మీకు మేలు చేస్తేనే ఓటు వేయాలని నగర పంచాయతీ కౌన్సిలర్ నిమ్మల నాగు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మాదివాడలోని 19వ వార్డులోని ముస్లిం వీధిలో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజును, ఎంపీగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మహిళలు ఏలూరి భారతి, షంషాద్, జబీన్, సుభద్ర, గాయిత్రీ, నాగిని, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిపక్షాల పోరు పడలేక రాజీనామా

ఆకివీడు: ప్రతిపక్షాల పోరుపడలేక మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. మండలంలోని దుంపగడప, చినకాపవరం గ్రామాలకు చెందిన 20 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఈమేరకు ఎంపీడీఓకు తమ రాజీనామా పత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మభూమి కమిటీల వలే తాము కమిషన్లకు కక్కుర్తిపడలేదని, నిజాయితీగా సేవలందిస్తున్న తమను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తీవ్రంగా విమర్శించడం సరికాదన్నారు. వలంటీర్లు కొల్లాటి విజయలక్ష్మి, తరగల హేమలత, పేటేటి ఈశ్వరి, వరలక్ష్మి, గాడి కల్యాణి, తమ్ము జానకీరాముడు, పాలపర్తి శ్యామ్ కిరణ్, గోరిసిమి నాయుడు, చినకాపవరం గ్రామానికి చెందిన 12 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు.



ఆకివీడు: దుంపగడపలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాల్ని అందజేస్తున్న వలంటీర్లు

కోరుకొల్లులో 29 మంది రాజీనామా

పాలకోడేరు: పాలకోడేరు మండలంలోని కోరుకొల్లు గ్రామంలో 29 మంది వలంటీర్లు మాకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ మేరకు శనివారం వారంతా కలిసి పంచాయతీ కార్యదర్శి శ్యాంకుమార్ కు రాజీనామా లేఖలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందించామని, అయితే ఎన్నికల నిబంధన వల్లతాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాము ఏదైనా పనిమీద బయటకు వస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేస్తున్నామని తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని వాపోయారు.



పాలకోడేరు: కోరుకొల్లులో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

వీరవాసరం: బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని నరసాపురం పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల తెలిపారు. వీరవాసరం మండలంలోని చింతలకోటిగరువు, రాయకుదురు, వీరవల్లి వారి పాలెం, జగన్నాధరావుపేట తదితర ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన పలు ఆత్మీయ సమావేశాల్లో పాల్గొని ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థిగా గ్రంధి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమా బాల విజయానికి కృషి చేయాలని పలువురు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, కడలి ధర్మారావు ,గూడూరి ఓంకారం, గెడ్డం భారతి, చవాకుల సత్యనారాయణ మూర్తి, పిల్లి వీరేశ్వరరావు, కోడే శ్రీనివాసు, కోడి యుగంధర్, దాసరి మహాలక్ష్మి, గెడ్డం భాస్కర రావు, దాసరి మాణిక్యాలరావు, కడలి సత్యనారాయణ, గుబ్బల రాంప్రసాద్, శిలబోయిన పద్మ కుమారి, గూడూరి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ పార్టీల కూటమికి బుద్ధి చెప్పండి

ఆకివీడు: మతతత్వ పార్టీలతో జతకట్టిన పార్టీల కూటమికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయ ఆవరణలో సీఐటీయూ రైస్‌మిల్లు కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు మాట్లాడుతూ గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మతాన్ని అడ్డు పెట్టుకుని ప్రజల్ని విభజించి పాలిస్తుందన్నారు. మతం ముసుగులో సామాన్య ప్రజలపై మోయలేని భారం వేస్తుందన్నారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చి కార్మికులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల్లో కార్పొరేట్, మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో బొర్రా సత్యం, మిద్దే లక్ష్మయ్య, ఎన్ని రత్తయ్య, గండేటి ఈశ్వరరావు, రమణ, ఆలేటి శ్రీను, పిసిని అన్నపూర్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సీఐటీయూ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

లోఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ: ఆచంట వేమవరం శివారు పడమటిపాలెం దళిత కాలనీలలో చాలా కాలంగా లోఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు సమస్యను పరిష్కరించాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆచంట ఎలక్ట్రికల్ ఆఫీస్ నందు ఏడీ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. పుష్పరాజ్ మాట్లాడుతూ చాలా కాలంగా లోఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సత్వరం సమస్య పరిష్కరించకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కొబ్బరి బొండాలకు డిమాండ్



విక్రయానికి సిద్ధంగా కొబ్బరి బొండాలు

ఆకివీడు: గ్రీష్మ తాపంతో కొబ్బరి బొండాలకు డిమాండ్ పెరిగింది. తీర ప్రాంతాల్లోకన్నా, మెట్ట ప్రాంతంలో కొబ్బరి బొండం పెద్దది లభించడమే కాకుండా నీరు అధికంగా ఉంటుంది. దీంతో కొబ్బరి బొండాల వ్యాపారులు పెద్దసైజు కొబ్బరి బొండాల్ని కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఒకొక్క బొండం ఖరీదు రూ.25 నుండి రూ.30 పలుకుతుంది. బాటిల్ కొబ్బరి నీళ్లు రూ.100కు విక్రయిస్తున్నారు. సహజసిద్ధంగా దొరికే కొబ్బరి నీటిని తాగితే వేసవిలో నీరసం, అలసట నుంచి ఉపశమనం లభిస్తుందని ప్రజలు ఎక్కువగా కొబ్బరిబొండాలు ఆశ్రయిస్తున్నారు.

స్ట్రాంగ్ రూముల్లో సామగ్రి భద్రం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సామగ్రి పట్టణానికి చేరుకుంది. శనివారం పట్టణంలోని అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములకు ఎన్నికల సామగ్రి చేరుకున్నాయి. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) బి.ఎస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 190 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. వీటి నిమిత్తం 228 బ్యాలెట్ యూనిట్లు, 228 కంట్రోల్ యూనిట్లు, 243 వీవీ ప్యాట్‌లు వచ్చాయన్నారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి బీయూసీలు 20 శాతం, వీవీ ప్యాట్‌లు 30 శాతం అదనంగా వచ్చాయని తెలిపారు. వీటిని 13 సీసీ కెమెరాల పర్యవేక్షణలో నాలుగు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచినట్లు తెలిపారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ పోర్స్ (సీపీపీఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) బలగాల పర్యవేక్షణలో భద్రపరిచామన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో దిగుమతి చేసి భద్రపరిచినట్లు తెలిపారు. తహసీల్దార్ మధుసూనదరావు, సీఐ కె.మంగాదేవి పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: తొలి విడతలో రాండమైజేషన్ పూర్తయిన ఈవీఎంలను ఆచంటలోని ఎంవీఆర్ జూనియర్ కళాశాలలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచామని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పర్యాటక శాఖ అధికారి రీజనల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి పార్లమెంటు, అసెంబ్లీ బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్ యూనిట్స్ వచ్చాయన్నారు.

ఓటమి చవిచూసినా.. అభివృద్ధిని విస్మరించలేదు

ఆకివీడు: గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడినా.. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆకివీడు రోడ్డును అభివృద్ధి చేశారు పీవీఎల్ నరసింహరాజు. ఆకివీడు నుంచి సిద్ధాపురం, దుంపగడప గ్రామాల్ని కలుపుతూ వెళ్లే ఈ రోడ్డులో గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలు పడిన అవస్థలు వర్ణనాతీతం. 40 ఏళ్ల క్రితం ఏర్పడిన ఆర్అండ్‌బీ రోడ్డు ఎప్పుడూ తాత్కాలిక రోడ్డు నిర్మాణంతోనే కాలం గడిచిపోయింది. ఒకటి రెండుసార్లు మాత్రం తారు రోడ్డు వేశారు. అది కూడా 4.5 మీటర్ల రోడ్డే. తూతూ మంత్రంగా వేసిన తారురోడ్డు ఏడాదికే కాలగర్భంలో కలిసిపోయేది. దీంతో ఆ రోడ్డు గుంతలు గుంతలుగా తయారైంది. రహదారి నిర్మాణం చేపట్టాలని రోడ్లపై వరి మొక్కల నాట్లు వేస్తూ.. వలలతో చేపలు పడుతూ వినూత్న రీతిలో ధర్నాలు, నిరాహారదీక్షలు చేశారు. ఉద్యమాలు చేసిన పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు అభివృద్ధి పనుల్ని మాత్రం పట్టించుకోలేదు. తాత్కాలిక మరమ్మతులతో కాలం గడిపేసేవారు. దీంతో వాహనచోదకులు, ప్రజలకు అవస్థలు తప్పేవికావు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరుపున పోటీ చేసిన పీవీఎల్.నర్సింహరాజు ఎన్నికల్లో తాను విజయం సాధిస్తే సిద్ధాపురం వెళ్లే రోడ్డు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో పీవీఎల్ ఓటమి చవిచూశారు. అయినా ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి సిద్ధాపురం వెళ్లే రహదారి వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేయించారు. వెంటనే కొబ్బరికాయ కొట్టి పనుల్ని ప్రారంభించి రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేయించారు. ఆకివీడు వైఎస్సార్ సెంటర్ నుంచి దుంపగడప వెళ్లే రోడ్డు వరకూ 10 మీటర్లు, అక్కడ నుంచి సిద్ధాపురం వెళ్లే రోడ్డు వరకూ 7 మీటర్ల విస్తీర్ణంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించి ప్రజల ఇబ్బందుల్ని శాశ్వతంగా దూరం చేశారు.



ఆకివీడులోని వైఎస్సార్ సెంటర్ వద్ద నుంచి సిద్ధాపురం గేటు వరకూ నిర్మించిన సీసీ రోడ్డు

ఎప్పుడూ తాత్కాలిక మరమ్మతులే..



వ్యాపార కూడలిగా ఉన్న ఆకివీడుకు రావాలంటే కొల్లేరు తీర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడేవారు. ఆకివీడు నుంచి సిద్ధాపురం వెళ్లే రహదారి బాగా పాడైపోయింది. లారీ వెళ్లే వీలున్న ఈ రోడ్డు గుంతలు గుంతలుగా తయారైంది. 40 ఏళ్ల నుంచి ఈ రోడ్డుకు ఎప్పుడూ తాత్కాలిక మరమ్మతులే. ఈ ఏడాది సీసీ రోడ్డు నిర్మించారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కరించిన పీవీఎల్ నరసింహరాజుకు ధన్యవాదాలు.

– నేరెళ్ల ఈశ్వరరావు, వ్యాపారి, సిద్ధాపురం రోడ్డు, ఆకివీడు.

దీర్ఘకాలిక సమస్య తీరింది



స్థానిక ప్రధాన సెంటర్‌లోని దీర్ఘకాలిక రోడ్డు సమస్య తీరింది. ఏళ్ల తరబడి ప్రజలు పడిన కష్టానికి పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో భారీ సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది. ఇటీవల భారీ వాహనాల రాకపోకలు అధికంగా పెరిగాయి. చేపలు, రొయ్యల లోడు, బియ్యం, ధాన్యం, చేపల మేత, ఇతరత్రా రవాణా పెరగడంతో సీసీ రోడ్డు నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఎస్కే.ఆరీఫ్, వైఎస్సార్‌సీపీ టౌన్ వైస్ ప్రెసిడెంట్, ఆకివీడు